
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 17 సెప్టెంబరు 2024



గణేష్ నిమజ్జనానికి వేళాయే.. 8
సమస్యలకు నిలయంగా కేసీఆర్ నగర్ 8



1935లో 4వ ఆంధ్రా మహాసభలో మాడిపాటి హన్మంతరావు, కొడిమ్యాల భూమయ్య తదితరులు

పోరు జ్ఞాపకాలు

- తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక
- నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం
- నేల రాలిన 14 మంది వీరులు
- నేడు ప్రజాపాలన దినోత్సవం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

రజాకార్ల ఆకృత్యాలను అడ్డుకునేందుకు ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ సాయుధ పోరాటానికి ఘన చరిత్ర ఉంది. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో సిరిసిల్ల ప్రాంతం కీలక భూమిక పోషించింది. మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు అనాటి పోరు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ప్రజాపాలన దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

దేశమంతా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నా నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానవాసులు మాత్రం ఆ మధుర క్షణాలను అనుభించడానికి 13 నెలల వరకు పోరాడాల్సి వచ్చింది. ఈ పోరులో సిరిసిల్ల ప్రాంతం ముఖ్య భూమికను పోషించింది. జిల్లాలోని ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు బద్దం ఎల్లారెడ్డితోపాటు సిరిసిల్లకు చెందిన అమృతలాల్‌శుక్లా, మామిడిపల్లి హన్మంతరావు, రాజలింగం, ఓదెలురెడ్డి, నాగారం కిష్టయ్య, రాజేశం, రాగులపల్లి నర్సయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, ఇలా అనేక మంది పోరాటంలో పాలుపంచుకున్నారు.

● ఉద్యమానికి ఊపిరినిచ్చిన ఆంధ్రమహాసభ

తెలంగాణ సాయుధ పోరాటానికి సిరిసిల్లలో జరిగిన ఆంధ్రమహాసభ ఊపిరినిచ్చింది. 1930లో సురవరం ప్రతాప్ రెడ్డి అధ్యక్షతన మెదక్‌జిల్లా జోగిపేటలో మొదటి మహాసభ జరిగితే నాలుగవ మహాసభ 1935లో మాడిపాటి హన్మంతరావు అధ్యక్షతన సిరిసిల్లలో భీమకవి నగరంగా నిర్వహించారు. ఆ తరువాత 1935లో ఎల్లప్రగడ సీతాదేవి, మాడపాటి మాణిక్యమ్మ అధ్యక్షతన మహిళా సభ జరిగింది.

● గెరిల్లాల శిక్షణ కేంద్రం మానాల

తెలంగాణ సాయుధ పోరు నుంచి మొన్నటి మావోయిస్టుల దళాలకు ఆశ్రయం ఇచ్చి మానాల ఉద్యమ స్ఫూర్తిని మానాల చాటుకుంటుంది. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సిరిసిల్ల డివిజన్ సరిహద్దులో ఉన్న మానాల గిరిజన ప్రాంతం ఇప్పటికీ మానని గాయాలు సల్పుతూనే ఉన్నాయి. సిరిసిల్లకు చెందిన అమృత్‌లాల్ శుక్లా, బద్దం ఎల్లారెడ్డి నాయకత్వంలో కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి, ఆర్మూర్, రుద్రంగి తాలూకాకు చెందిన కార్యకర్తలకు ఆ అరణ్యం గాయిది గుట్ట శిక్షణ కేంద్రంగా ఉండేది. కమ్యూనిస్టు గెరిల్లాకు ఆ గ్రామ భూస్వామి రాజిరెడ్డి భోజనాలు సరఫరా చేసేవారు. మానాలలో గెరిల్లాలు శిక్షణ పొందుతుండగా వంద మంది నిజాం సర్కారు పోలీసులు నిర్బంధించి రుద్రంగి క్యాంపునకు గెరిల్లాలను తరలించారు. ఆ తరువాత నీలం కిష్టయ్య, ముదాం ఎల్లయ్య, సిలివేరు ఎల్లయ్య, లకావత్ కిషన్‌ను మానాల అడవు ల్లోకి తీసుకువెళ్లి వారి చేతనే కట్టెలు కొట్టించి, చితి పేర్చి తుపాకులతో కాల్చి దహనం చేశారు. మరోవైపు కమ్యూనిస్టు గెరిల్లాలు బార్డర్ క్యాంపులను నెలకొల్పారు. సరిహద్దు ప్రాంతాల్లోని చాందా, నాగ్‌పూర్, సిరివంచ ప్రాంతాల్లోని కార్యకర్తలకు ప్రసాద్ అనే కమ్యూనిస్టు నాయకుడు శిక్షణ ఇచ్చారు. ప్రసాద్ నేతృత్వంలోనే అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, కట్టెపల్లి మురళీధర్‌రావు, కాలువ నారాయణరెడ్డి, నంభయ్యతదితరులు బార్డర్ క్యాంపులో శిక్షణ పొందిన వారే.



మానాలలో మహిళ స్థూపం

● సిరిసిల్లలో చేనేత కార్మిక సభ

సమస్యల పరిష్కారం కోసం చేనేత కార్మిక సంఘం ఏర్పడింది. సంఘం తెలంగాణ తృతీయ మహాసభను సిరిసిల్లలో జరుపుకున్నారు. డాక్టర్ గాజుల భూపతి, పత్తిపాక విశ్వనాథం ఆహ్వాన సంఘంగా ఏర్పడి 1946లో సభ నిర్వహించారు. సభకు ముంబాయి. షోలాపూర్, అహ్మదాబాద్ నుంచి చేనేత, కార్మిక ప్రతినిధులు సిరిసిల్లకు తరలివచ్చారు. నిజాం నవాబ్ వైద్యుడిగా ఉన్న నారాయణదాస్‌ను ఎన్నుకున్నారు. సభలోని ప్రతినిధులు ఎవరూ ఇష్టపడలేదు. సంస్థానం బయట నుంచి వచ్చిన వారిలో ఒకరిని ఎన్నుకోవాలని పట్టుబట్టారు. ఆహ్వాన సంఘం ప్రతినిధి న్యాయవాది కొడిమ్యాల భూమయ్య మాటలను ఎవరూ వినకపోవడంతో కామారెడ్డిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అమృతలాల్ శుక్లాను పిలిపించారు. సంస్థానంలో ఉన్నవాడైన ఉద్యమ రీత్యా కొండ లక్ష్మణ్‌ను ఎన్నుకోవాలని సూచించారు.

● పోరాటాల పురిటి గడ్డ... గాలిపెల్లి



గాలిపెల్లి గ్రామం

తెలంగాణ సాయుధ పోరాటంలో గాలిపెల్లి నాయకత్వం వహించింది. తెలంగాణ యోధుడు బద్దం ఎల్లారెడ్డి, గెరిల్లా దళనాయకుడు అమృత్‌లాల్ శుక్లాతోపాటు ఉద్యమకారులు, దళ నాయకులు గాలిపెల్లిలో తలదాచుకుంటున్నారని కలెక్టర్‌తో కలిసి పోలీసు బలగాలు గాలిపెల్లిని చుట్టు ముట్టాయి.. బద్దం నర్సింహారెడ్డి, ముస్కానిపేట సూర్యారావు ఇదంతా చూసి ఆయుధాలను దాచిపెట్టాలని నిర్ణయించారు. 1947 సెప్టెంబర్ 14న గాలిపెల్లిలో ప్రజల గుంపును చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటి వరకు అక్కడే ఉన్న అమృత్‌లాల్ శుక్లా పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకున్నాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల్లో 14 మంది మృతి చెందారు. గాలిపెల్లికి చెందిన పీసు బక్కయ్య, బద్దం నారాయణ, పెరంబుదూరి అనంతయ్య, రంగమ్మ, బుర్రయ్య, పులుగారి ఎల్లయ్య, అల్లె వెంకయ్యతో పాటు తాళ్ళపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి, నర్సక్కపేటకు చెందిన ఎలేటి రాజిరెడ్డి, బేగంపేటకు చెందిన తమ్మోజు నారాయణ, సోమారంపేటకు చెందిన ఆయరెడ్డి భూంరెడ్డి నేలకొరిగారు.

ప్రజాపాలన దినోత్సవానికి సర్వం సిద్ధం



కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లు

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 9.30 గంటలకు సిరిసిల్లలో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద విప్ ఆది శ్రీనివాస్ నివాళులు అర్పిస్తారు. 9.59 గంటలకు కలెక్టరేట్ చేరుకుంటారు. 10 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 10.01 గంటలకు జాతీయ గీతాలాపన, 10.02 గంటలకు తెలంగాణ గీతం, 10.07 నిమిషాలకు పోలీసుల గౌరవ వందనం స్వీకరణ, 10.16 నిమిషాలకు పలు పథకాల లబ్ధిదారులకు పత్రాలను అందించనున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా సిరిసిల్లలో ఇంతేజామీ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీని ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా ప్రధానాస్పత్రిలో పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ సలీం మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా మెలగాలని, అన్ని మతాలను గౌరవిస్తూ అన్నదమ్ములుగా మెలగాలని అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా కొన్ని కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. బైక్ ర్యాలీ, నమాజ్, అంబేద్కర్ చౌరస్తాలో ప్రవక్త జన్మదినానికి సంబంధించి ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మహ్మద్ నయీమ్, మహ్మద్ నౌసిన్, మహ్మద్ రఫీయొద్దీన్, మహ్మద్ అంజాద్, మహ్మద్ చాంద్, చాంద్‌పాషా, అమీర్‌పాషా, జాకీర్, రియాజ్, జలీల్, సిద్దిఖీ పాల్గొన్నారు.

మిడ్ మానేరుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 16: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్‌ఆర్‌ఎస్‌పీ వరద కాలువ ద్వారా 7350 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇందులో అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400 క్యూసెక్కులు, ఎల్‌ఎండీ ప్రాజెక్ట్ 3136 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.75 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 26.66 టీఎంసీలు ఉంది.

ముంపు గ్రామాల్లోకి మిడ్ మానేరు బ్యాక్ వాటర్



పునరావాస కేంద్రానికి వెళ్తున్న బాధిత కుటుంబం

వేములవాడ రూరల్, సెప్టెంబరు 16: మిడ్‌మానేరు నీటి మట్టం పెరగడంతో బ్యాక్‌వాటర్ గ్రామాల్లోకి చేరింది. వేములవాడ అర్బన్ మండలం ముంపు గ్రామమైన సంకెపల్లికి బ్యాక్ వాటర్ చేరుకుంది. దీంతో గ్రామంలో ఉన్న బుర్ర మల్లయ్య ఇంటి ముందు వరకు నీరు చేరింది. సమస్యను స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వారిని వెంటనే ఆర్‌అండ్ ఆర్ కాలనీలోని ఓ ఇంటికి తరలించారు. కుటుంబ సమస్యలపై కోర్టులో కేసు నేపథ్యంలో వారికి ఇంటి నష్టపరిహారం అందలేదని తెలిసింది. తమ సమస్యను పరిష్కరించాలని బుర్రమల్లయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16: మండలంలోని వల్లంపట్లకు చెందిన ఇద్దరికి సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. జంగిటి లత, చట్ల బాలయ్యకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందింది. ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

సెస్‌కు తోడ్పాటు అందించండి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి వినతి



కరీంనగర్‌లో కేంద్రమంత్రిని కలిసిన సెస్ పాలకవర్గ సభ్యులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 16: సిరిసిల్ల విద్యుత్ సరఫరా సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. కరీంనగర్‌లో సోమవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను సెస్ చైర్మన్ ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు, అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా సెస్ పరిధిలోని విద్యుత్ బకాయిలతోపాటు సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ రాయితీలను సెస్‌కు అందించాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ సహకార సరఫరా సంస్థలను కాపాడుకోవడంతోపాటు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతీ పథకాన్ని సెస్‌కు అందించి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి డైరెక్టర్‌లు కొట్టేపల్లి సుధాకర్, వరసు కృష్ణహరి పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను సోమవారం జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు మార్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బండి సంజయ్ కుమార్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయినగోపీ, రేగుల మల్లికార్జున్, మాజీ ఎంపీపీ బండ మల్లేష్‌యాదవ్, గోపు బాలరాజు, బూర విష్ణువర్ధన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. సోమవారం సిరిసిల్ల మానేరు తీరంలో నిమజ్జనం కోసం చేస్తున్న ఏర్పాట్లను కమిషనర్ మీర్జా ఫసహల్ అలీ బేగ్, డీఈ ప్రసాద్, ఏఈ నరసింహస్వామి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంగళవారం జరిగే వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మున్సిపల్ నుంచి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మానేరు వాగులో నీటి మట్టం సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వినాయక మండల నిర్వాహకులు విగ్రహాలను సకాలంతో తీసుకొచ్చి నిమజ్జనం చేయాలన్నారు భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించుకోవాలన్నారు. మున్సిపల్ పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని, నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించాలని కోరారు.

వేములవాడలో గణేష్ నిమజ్జనం

- కన్నుల పండువగా శోభాయాత్ర
- తరలివచ్చిన భక్తజనం



వేములవాడ గుడి చెరువులో గణనాథుడి నిమజ్జనం

వేములవాడ, సెప్టెంబరు 16: గణనాథుడి నిమజ్జనోత్సవం వేములవాడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి పర్వదినం నాడు వాడవాడలా వెలసి తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న ఆది దేవుడు విఘ్నేశ్వరుడు సోమవారం సాయంత్రం కన్నుల పండుగ సాగిన శోభాయాత్ర అనంతరం గుడి చెరువులో ఒదిగి పోయాడు. విఘ్నాలను తొలగించి, శుభాలను ప్రసాదించే బొజ్జ గణపయ్యను భక్తి శ్రద్ధలతో పూజించిన పట్టణ ప్రజలు వైభవంగా శోభాయాత్ర నిర్వహించి గుడి చెరువులో నిమజ్జనం శారు. పట్టణంలోని పలు వీధుల్లో సుమారు 200కు పైగా పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేయగా, పెద్ద క్రేన్ల సాయంతో పెద్ద విగ్రహాలను శోభాయాత్ర కోసం అందంగా అలంకరించిన వాహ నాలపై ఉంచి గణపతి బప్పా మోరియా.. అంటూ మేళతాళాల మధ్య ఊరేగించారు. భక్తి పాటలకు అనుగుణంగా నృత్యాలు, భజనలు చేస్తూ పట్టణ వీధుల మీదుగా కన్నుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. నిమజ్జనోత్సవ ఊరేగింపు సాంప్రదాయబద్ధంగా సాగగా, కాషాయ దుస్తులు ధరించిన నాయకులు, గణేశ్ ఉత్సవ నిర్వాహకులు ముందు నడిచారు. ఒగ్గుడోలు బృందం కళాకారుల ప్రదర్శనతోపాటు హైదరాబాద్ నుండి రప్పించిన కళాకారుల రకరకాల వేషాధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు గణేశ్ శోభాయాత్ర లో నృత్యాలు చేయడం ఆకట్టుకుంది. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆదిశ శ్రీనివాస్ గణేష్ నిమజ్జోత్సవం శోభాయాత్రలో పాల్గొని నిర్వాహకులు, యువకులతో కలిపి భక్తి పాటలపై చిందేశారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి నేతృత్వంలో సిఐలు వీరప్రసాద్, శ్రీనివాస్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వేములవాడ రూరల్: వేములవాడ అర్బన్, రూరల్ మండలంలో సోమవారం గణపతి నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేసారు.

కోనరావుపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న వినాయకుని సోమవారం భక్తులు చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రుద్రంగి: మండలకేంద్రంలో గణనాథులను వీడ్కోలు పలికారు. మార్కండేయ ఆలయం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయకులను నిమజ్జనం చేశారు. కృష్ణ వేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో మట్టి గణపతిని నిమజ్జనం చేశారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గూడెం, నామాపూర్, ఆవునూర్, పోతుగల్, బందనకల్ గ్రామాల్లో గణేశ్ నిమజ్జన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు సోమవారం శోభాయమానంగా కొనసాగాయి. అనంతరం గ్రామ శివారుల్లోని నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాలలోని మండపాలలో ఏర్పాటు చేసిన వినాయకులను సాయంత్రం వాహనాలపైకి ఎక్కించి, పురవీధుల గుండా ఊరేగించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పోలీసులు బందోబస్తు మధ్య సోమవారం వినాయక శోభాయాత్ర నిర్వహించారు. ఎస్ఐ ఎల్లాగౌడ్, పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేశారు.



శోభాయాత్రలో యువకులు



శోభాయాత్రలో చిన్నారులు



భజన చేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు



శోభాయాత్రలో ఆది శ్రీనివాస్, ప్రతాప రామకృష్ణ



వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఏఎస్పీ



ఎల్లారెడ్డిపేటలో వినాయక శోభాయాత్ర



మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప


28కిలోల చేపతో మత్స్యకారుడు తిరుపతి

తిమ్మాపూర్,సెప్టెంబరు16: తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో ఓ మత్స్యకారుడి వలకు 28కిలోల చేప చిక్కింది. తిమ్మాపూర్ మండలం సంగంపల్లికి చెందిన తిరుపతి అనే మత్స్యకారుడు సోమవారం కొత్తపల్లి గ్రామం వద్ద లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్ విస్తరించి ఉన్న మోయతుమ్మెద వాగులో వలతో చేపలు పడుతుండగా 28కిలోల బొచ్చె వలకు చిక్కింది. భారీ చేప వలకు చిక్కడంతో తిరుపతి సంతోషం వ్యక్తం చేశాడు. ఈ చేప ధర సుమారు 5వేల రూపాయల వరకు ఉంటుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు. ఇటీవల పుష్కలంగా వర్షాలు పడటంతో జలాశయాలలో మత్సకారులకు భారీ చేపలు దొరుకుతున్నాయి. ఇంత పెద్ద చేప ఈ ప్రాంతంలో దొరకడం అరుదైనదిగా వారు పేర్కొంటున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న బియ్యం ట్రక్కు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16: గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు 10టన్నుల బియ్యాన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. రామగిరి మండలం బేగంపేట కేంద్రంగా రేషన్ బియ్యంను మహారాష్ట్రకు రవాణా చేస్తున్నారు. రేషన్‌షాపులు, గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని దర్జాగా తరలిస్తున్నారు. ఈ తరలింపునకు ట్రక్కులే కొనుగోలు చేశారు. ఆదివారం రాత్రి బేగంపేట నుంచి మహారాష్ట్రకు ట్రక్కులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు గోదావరిఖని 2ఏ మోరీ సమీపంలో వన్‌టౌన్ క్రైమ్ పార్టీ పోలీసులు అడ్డుకున్నారు. టీఎస్22 టీఏ1431 ట్రక్కులో 10టన్నుల రేషన్ బియ్యం, రేషన్ బియ్యం సరఫరాకు సివిల్ సప్లై వాడే గోనె సంచులు కూడా దొరికినట్టు తెలుస్తోంది. ట్రక్కును వన్‌టౌన్‌కు తరలించి ట్రక్కులో ఉన్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండు నెలల క్రితం కూడా బేగంపేటకు చెందిన రేషన్ బియ్యం మాఫియా మహారాష్ట్రకు తరలిస్తుండగా ట్రాలీలను పోలీసులు పట్టుకున్నారు.

ఇంజనీర్స్ డే వేడుకలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 16: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని కాళేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కంది జ్యోతి, కస్తూరి భారతి, సిద్ది సరిత, కొండ రాధిక, రాగి వందన, కొండూరి రాధిక, చింతల లావణ్య పాల్గొన్నారు.

● బొమ్మకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు ఇంజనీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బట్టు రాజేందర్, జోన్ చైర్‌పర్సన్ చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఎస్జీటీ యూనియన్ వినతి

కరీంనగర్ టౌన్/భగత్‌నగర్, సెప్టెంబరు 16: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ బాధ్యులు సోమవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్జీటీ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, మదుసూదనరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాం శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీధర్‌రెడ్డి, శాంతికిరణ్, శశిధర్, విజేందర్‌రెడ్డి, శేఖర్, మండల బాధ్యులు తదతరులు పాల్గొన్నారు.





















న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద



జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం వరద నీరు రావడం తగ్గింది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అటవీ శాఖ అధికారులకు నెమలి అప్పగింత



అధికారులకు నెమలిని అప్పగిస్తున్న యువకుడు

చందుర్తి, సెప్టెంబరు 16 : చందుర్తి మండలం బండపల్లిలో చెరువు ప్రాంతంలో కాలుకు గాయమైన జాతీయపక్షిని గ్రామానికి చెందిన యువకులు రక్షించారు. కాలుకు గాయమై ఇబ్బంది పడుతున్న నెమలిని గమనించిన నాగరాజు, వేణు, మణిసాగర్ అటవీశాఖ సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌కు సమాచారం ఇచ్చారు. అనంతరం దానికి వైద్యం చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

భూ వివాదం పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి



సెల్ టవర్ ఎక్కిన పొన్నాలు

చందుర్తి సెప్టెంబరు 16: తన సోదరుడితో కొన్ని సంవత్సరాలుగా భూ వివాదం నడుస్తోందని, సమస్య పరిష్కరించే న్యాయం చేయాలని ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బాతో చందుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సెల్ టవర్ ఎక్కాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జ గట్టు పొన్నాలుకు అతడి తమ్ముడు మోహన్‌తో భూ వివాదం కోర్టులో ఉంది. సమస్య పరిష్కారం కావడం లేదని, తనకు న్యాయం చేయాలని పురుగుల మందు డబ్బాతో చందుర్తి చేరుకొని సెల్ ఎక్కాడు. ఆత్మహత్య చేసుకుంటానని పేర్కొనడంతో సీఐ వెంకటేశ్వర్లు న్యాయం చేస్తామని, సెల్‌టవర్ దిగి రావాలని సూచించారు. దీంతో టవర్ దిగి వచ్చాడు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 16నుంచి 23 వరకు విద్యాలయ సమితి పెంచినట్లు ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



చింతల గుట్ట నుంచి తవ్విన మట్టి



మట్టిని టిప్పర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్



తవ్వి తొలగించిన బండరాళ్లు

తోడేస్తున్నారు..

● అనుమతులు లేకుండా మట్టి తరలింపు ● కరుగుతున్న గుట్టలు ● పట్టించుకోని అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 16 : తిమ్మాపూర్ మండలంలోని గుట్టలను ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వి కొందరు యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో కొద్ది రోజులుగా ఈ దందా బహిరంగంగానే కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూమి, గుట్టలు అంటూ చూడకుండా కొందరు ఇష్టారీతిలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రామకృష్ణ కాలనీ గ్రామ శివారు చెర్లపల్లిలో చింతలగుట్టను ధ్వంసం చేస్తూ కొన్ని రోజులుగా జేసీబీలతో మట్టి తీసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఒక టిప్పర్‌కు 2,800 నుంచి 3వేల రూపాయల చొప్పున మట్టి విక్రయిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండిపెడుతున్నారు. చింతలగుట్ట పట్టా భూమి అని అది ఉల్లెంగుల ఏకానందం అనే వ్యక్తికి సంబంధించిన భూమి అని అతని అనుమతితోనే మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు అక్కడ ఉన్న వ్యక్తులు తెలిపారు. పట్టా భూమి అయినా మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వ అనుమతులు తీసుకోవాల్సి ఉండగా ఇవేవీ వీరు పట్టించుకోక పోవడంతో పాటు ఇష్టారీతిలో తవ్వకాలు చేపడుతున్నారు. పట్టా భూమిలోని మట్టిని పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలించాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని అధికారులు తెలిపారు. తవ్వకాలకు సంబంధించిన వ్యక్తి ఏకానందం తన భూమి తన ఇష్టం అని అధికారులను తాను చూసుకుంటు న్నానని చెప్పడం గమనార్హం. మట్టి తవ్వకాలకు, మట్టి విక్రయాలకు ఎవరి అనుమతి అవసరం లేదని తన భూమి తనఇష్టం అని ఆయన పేర్కొన్నాడు. అధికారులకు సమాచారం అందడంతో మట్టి తవ్వకాలు నిలిపివేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చరిత్రను కనుమరుగు చేస్తున్నారు

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 16 : ప్రజా పాలన పేరుతో తెలంగాణ చరిత్రను కనుమరుగు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారన్నారు. అందుకే తెలంగాణ ప్రజా పాలన కార్యక్రమాలకు హాజరు కావడం లేదన్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా హాజరవుతామన్నారు. కేంద్రం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతన్నామన్నారు. సర్దార్‌పటేల్ పోలో ఆపరేషన్‌తోనే నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ఎంఐఎం పార్టీకి బయపడి ఒక వర్గం ఓట్లకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా ప్రజలను వంచిస్తున్నాయన్నారు. రజాకార్ పార్టీ వారసుడు ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జాచేసి పేదలను దోచుకుంటున్నాడని బండి సంజయ్ ఆరోపించారు. అలాంటి ఓవైసీ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కూల్చ కుండా ఓవైసీకి వంతపాడుతున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సర్దార్ పటేల్ మాకు వీరుడే అని, పటేల్ వారసులం మేమే అని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి మరల్చేందుకే రాజీవ్ విగ్రహం తెరపైకి తెచ్చారన్నారు. ఖాళీగా ఉన్న కేసీఆర్ కుటుంబానికి ఢిల్లీ సీఎం పదవి ఇచ్చేందుకే కేజ్రీవాల్ రాజీనామా చేశారేమోనని ఎద్దేవా చేశారు. వారిద్ద రిది లిక్కర్ బంధమన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనంపై రాష్ట్ర ప్రభుత్వం గణేష్ ఉత్సవ కమిటీతో చర్చించి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. హిందు పండుగలపై వివక్ష చూపుతున్నారనే భావన ఉందన్నారు. నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించు కుని పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బండి సంజయ్ అన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 16 : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన మామిడి చంద్రయ్య (52)అనే వ్యక్తి మతి స్థిమితం సరిగా లేక ఆదివారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చంద్ర య్య ఆర్థికంగా ఇబ్బందులపాలై, మద్యానికి బాని సయ్యాడు. దీంతో మతిస్థిమితం సరిగా లేక ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. చంద్రయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర యోగా ఛాంపియన్‌గా ఉమ్మడి జిల్లా జట్టు



ఛాంపియన్ షిప్‌ను అందుకుంటున్న ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16: తెలంగాణ రాష్ట్రస్థాయి యోగాసన ఛాంపియన్ షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. ఈనెల 14, 15 తేదీల్లో హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ఉమ్మడి జిల్లాజట్టు 116 పాయింట్లు సాధించి మొదటి స్థానంతో పాటు ఓవర్‌ఆల్ ఛాంపి యన్ షిప్‌ను అందుకుంది. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకా రులు 7బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలతో పాటు 5వ స్థానంలో నలుగురు, 6వ స్థానంలో ఆర్గురు క్రీడాకా రులు నిలిచి కప్పును కైవసం చేసుకున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాష్ట్రంలోనే అత్యధికంగా 16 మంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఛాంపియన్స్‌గా నిలిచిన జిల్లా జట్టును జిల్లా యోగా సం్ఘం అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, డివైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, యోగా సంఘం ఉపాధ్య క్షుడు కన్న కృష్ణ, కోచ్‌లు రామకృష్ణ, వి కిష్టయ్య, మల్లేశ్వరి, స్వరూపాచారి, మనోజ్‌కుమార్, విజయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

జిల్లా జైలులో గాంధీ విగ్రహం ఆవిష్కరణ



గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ డీఐజీ సంపత్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 16 : కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సోమవారం జైళ్ళశాఖ డీఐజీ ఎం.సంపత్ ఆవిష్కరిచారు. జిల్లా జైలును వరంగల్ రేంజ్ డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్‌ప్రిజన్స్) ఎం.సంపత్ సంవత్సర తనిఖీలో భాగంగా సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయసేవా, ఆరోగ్యసమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత జైలులో కాంటీన్, జైలు ఆసుపత్రి ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, ఖైదీల టాయిలెట్లు, శుభ్రత, వంటశాల, జైలు ఇండస్ట్రీ, పెట్రోల్ బంకులలో పని తీరును తెలుసుకుని అధికారులను అభినందించారు. జైలులోని గార్డెనింగ్ నిర్వహణ, పరిశుభ్రత బాగుందని అధికారులను అభినందించారు. మహిళా జైలును కూడా డీఐజీ సందర్శించారు. అనంతరం జైలు క్వార్టర్‌లో శ్రీ విఘ్నేశ్వర స్వామి పూజలో డీఐజీ పాల్గొన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యాధికారి వేణు గోపాల్, జైలర్స్ శ్రీనివాస్, రమేష్, పర్శ రామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్ సుధాకర్ రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి

బీర్‌పూర్,సెప్టెంబరు 16 : బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు సోమవారం దాడి చేశాయి. గ్రామంలోని చెందిన పోతు రమేష్ కుమారుడు రాణా(9), బొమ్మి డి శశిధర్ కూతురు అధ్వశ్రీ(4) అనే చిన్నారులు వారి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా వీధికుక్కలు ఇద్దరు చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. పిల్లల అరుపులు విన్న రాణా తల్లి గమనించి కుక్కల దాడి నుంచి పిల్లలను రక్షించారు. వెంటనే చిన్నారులను ఆసుపత్రికి తరలించారు.



గేట్లు ఎత్తడంతో కిందకు వస్తున్న నీరు

ఎల్ఎండీ గేట్లు ఎత్తిన అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 16 : ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పాటు మధ్యమానేరు నుంచి సుమారు 3వేల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఎల్ఎండీ జలాశయం ప్రధానగేట్లు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఇరిగేషన్ ఎస్ఈ పెద్ది రమేష్ ఆధ్వర్యంలో అధికారులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం నీటిలో ఇరిగేషన్ అధికారులు పూలుజల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ పెద్ది రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం లోయర్ మానేర్ డ్యాంలో 23.90 టీఎంసీల నీరు ఉందని ఎగువ ఎంఎం ఆర్ నుంచి 3వేల క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తుండటంతో రెండు గేట్లు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ పెద్ది రమేష్, ఈఈ నాగభూషణం, డీఈ శ్రీనివాస్, ఏఈఈలు కాళిదాస్, వంశీధర్, అంజుమునీసా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు గంటల తర్వాత తిరిగి మూసివేత

ఎస్సారెస్పీ నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎంఎంఆర్ నుంచి మూడు వేల క్యూ సెక్కు లు ఎల్ఎండీలోకి విడుదల చేశారు. దీంతో అధికారులు 11.30 గంటల సమయంలో గేట్లు మూసివేశారు. అనంతరం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను మూడువేల క్యూసెక్కులకు పెంచారు. ఎల్ఎండీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 4,732, ఔట్‌ఫ్లో 3,309 క్యూసెక్కులు ఉంది.

'నవోదయ'లో ముగిసిన కళోత్సవాలు



విద్యార్థుల ప్రదర్శనలు

చొప్పదండి, సెప్టెంబర్ 16 : చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో కళోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం ఉత్సవాలు ప్రారంభం కాగా రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తెలంగాణ క్లస్టర్ స్థాయిలోని తొమ్మిది జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరై వివిధ పోటీలలో పాల్గొన్నారు. నల్లగొండ విద్యాలయం వోకల్ మ్యూజిక్, నృత్యంలో నాగర్‌కర్నూల్, కరీంనగర్ ఇన్‌స్ట్రు మెంటల్, నిజామాబాద్ స్టోరీ టెల్లింగ్, మెదక్ విద్యాలయం విజువల్‌ఆర్ట్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగతాయారు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

సింగరేణి కార్మికుడి అనుమానాస్పద మృతి

● ఒంటిపై తీవ్రగాయాలు
● నెల రోజుల్లో పదవీవిరమణ
● మృతిపై అనేక సందేహాలు
● మార్చురీకి తరలించిన పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 16 : గోదావరిఖని ఐబీ కాలనీలో నివాసముండే సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అతని గొంతు, చాతి, కాళ్లపై గాయాలున్నాయి. హరిసింగ్ కుటుంబం ఐబీ కాలనీలోని క్వార్టర్ నంబర్ 612లో నివాసముంటున్నది. అతనికి భార్య దస్లి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురుకు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిసింగ్ మెడికల్ అన్‌ఫిట్‌కు ప్రయత్నించగా అన్‌ఫిట్ కానట్టు తెలుస్తోంది. నెలరోజుల్లో పదవీ విరమణ ఉన్నట్టు సమాచారం. సోమవారం సాయంత్రం హరిసింగ్ భార్య దస్లి బయటకు వచ్చి తన భర్త పరిస్థితి విషమంగా ఉందని స్థానికులకు చెప్పడంతో వారు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అతడు మృతి చెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. మృత దేహంపై గాయాలు ఉండటంతో వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హరిసింగ్ మృతిపై అనుమానాలు ఉండడంతో మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.

● గుర్తు తెలియని వ్యక్తుల సంచారం..

సోమవారం మధ్యాహ్నం నుంచి హరిసింగ్ ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సంచారంతో స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గణపతులు వచ్చిన సమయంలో ఇద్దరు వ్యక్తులువచ్చి వెళ్లారని, కొద్దిసేపటికే హరిసింగ్ మృతి చెందారనే చర్చ జరుగుతోంది.

● మృతిపై అనుమానాలున్నాయి...

- వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని ఐబీకాలనీలో హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయి. మృతదేహాన్ని మార్చురీకి తరలించాం. దీనిపై దర్యాప్తు చేస్తున్నాం. మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తాం.

పోలీస్ సైరన్‌తో తిరుగుతున్న వాహనం సీజ్

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : పోలీస్ సైరన్ వాహనానికి అమర్చుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. సోమారంపేట గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ తన డ్రైవర్ పల్మారి శ్రీనివాస్‌తో కలిసి నిబంధనలకు విరుద్ధంగా కారుకు పోలీస్ సైరన్ అమర్చుకున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామానికి హైడ్‌కానిస్టేబుల్ దేవేందర్ వెళ్లగా సైరన్ బిగించిన వాహనాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసున మోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 16 : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలై చికిత్స పొంతుతున్న వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. పట్టణంలోని పద్మనగర్ ప్రాంతానికి చెందిన సింగం సుగుణ(80) అనే వృద్ధురాలు ఆదివారం తన ఇంటలో వంట చేస్తున్న సమయంలో ప్రమాదావశాత్తు గ్యాస్ సిలిండర్ మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అదే రోజు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుగుణ సోమవారం మృతి చెందింది. మృతుడి కుమారుడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసునమోదు చేసినట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఏనుగుల ముత్తయ్య(33) అనే వ్యవసాయ కూలీ ఆర్థిక ఇబ్బందులతో చెట్టుకు ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం .. ముత్తయ్య గ్రామంలో ఉపాధిలేక పోవడంతో రెండు సార్లు విదేశాలకు వెళ్లాడు. అక్కడా సరైన పని దొరకక ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ముత్తయ్యకు రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. అనంతరం ఇంటికి వచ్చి వ్యవసాయం చేసినా అప్పులు తీరలేదు. అప్పులు తీర్చేమార్గం కనిపించకపోవడంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామసమీపంలో సోమవారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ, సెప్టెంబరు 17 : గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. వేములవాడలో గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. గణేష్ శోభాయాత్ర సాఫీగా సాగే విధంగా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులదేనని, శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. అనంతరం గుడి చెరువు కట్టపై గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తును ఎస్పీ అఖిల్ మహాజన్ స్థానిక అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలిసి పరిశీలించారు. పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పతాకాలను ఎగురవేయాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మంగళవారం అన్ని గ్రామాల్లో జాతీయ పతాకాలను ఎగురవేయాలని బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రతీ ఒక్కరు మొక్కను నాటి బీజేపీ సభ్యత్వాలను సేకరించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికలలో 80శాతం పోలింగ్ దాటిన గ్రామాలుగా కందికట్కూర్, ఇల్లంతకుంట, అనంతారం, సిరికొండ, రామోజీపేట, తెనుగువానిపల్లె నిలిచాయని, బూత్‌కమిటీ సభ్యులకు ఈనెల 18న సన్మానం చేయనున్నామని తెలిపారు.

లంబోదరుడికి నైవేద్యాలు



గణనాథునికి సమర్పించిన నైవేద్యాలు

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):శివపార్వతుల సుతుడు లంబోదరుడికి మహానైవేద్యాలను సమర్పించారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యాకపరమేశ్వరీ ఆలయంలో, పెద్దబజార్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి దాదాపు 400 రకాల నైవేద్యాలను సమర్పించారు. మహిళలు కూరగాయలు, స్వీట్లతో తయారు చేసిన వినాయక ఆకృతులు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ ఆకృతుల్లో ఉన్న వినాయకులతో సెల్ఫీలు తీసుకున్నారు.

పదోతరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 16: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేటలో సోమవారం మాట్లాడారు. మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు కేంద్రాలు కేటాయించినా పదో తరగతి కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని, కేంద్రం ఏర్పాటుకు పాడు పడుతామని అన్నారు. ఈ విద్యా సంవత్సరం మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్ తదితరులు ఉన్నారు.

పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 16: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం చెట్లను నరికి వేశారు. మొక్కలు నాటి సంరక్షించిన అధికారులు వృక్షాలను నరికి వేసినా పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెట్లను నరికి వేసిన వ్యక్తులను గుర్తించాలని, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్యసాధనకు సంకల్పంతో ముందుకెళ్లాలి

గంభీరావుపేట సెప్టెంబరు 16: లక్ష్యం నెరవేర్చుకోవాలంటే దృఢ సంకల్పంతో ముందుకెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. గంభీరావుపేట మండలం శ్రీగాధకు చెందిన వేముల కాశాగౌడ్ డాక్టరేట్ పొందిన సందర్భంగా పంచాయతీ ఆవరణలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ మారుమూల గ్రామంలోని మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టిన కాశాగౌడ్ డాక్టరేట్ పొందడం గొప్పవిషయమన్నారు, సహకార సంఘాలపై చేసిన పరిశోధనలు రైతులకు ఉపయోగ పడుతాయన్నారు. మాజీ సర్పంచ్ కత్తుల బాబు, మాజీ ఉపసర్పంచ్ ఆకారపు కాశి, నాయకులు బాలరాజు, యాదగౌడ్, వెంకటస్వామి, శ్రీనివాస్, కార్తీక్, గణేష్, ప్రశాంత్, సతీష్, రాజు, దేవరాజు, సురేష్, సంపత్, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో గణేష్ శోభాయాత్ర

వేములవాడ, సెప్టెంబర్ 16:గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి వేములవాడ పట్టణంలో పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో పట్టణంలో గణేష్ శోభాయాత్ర చీకట్లోనే సాగింది. సాయంత్రం నుంచి పలుమార్లు విద్యుత్ సరఫరాలో అక్కడక్కడ అంతరాయం కలుగగా, 6.45 గంటల అనంతరం పట్టణమంతా ఒకసారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అప్పటికే గణేష్ శోభాయాత్ర ప్రారంభం కాగా తిలకించడానికి పలు కూడళ్లలోకి చేరుకున్న ప్రజలు చీకట్లోనే ఉండిపోయారు. పట్టణంలోని బాలానగర్ సమీపంలో విద్యుత్ వైరు తెగిపోవ డంతో పట్టణానికి సరఫరా నిలిచిపోయిందని విద్యుత్ అధికారులు తెలిపారు. చాలాసేపు విద్యుత్ సరఫరా లేకపోవడంతో శోభాయాత్ర చీకట్లో సాగింది.

గుండెపోటుతో మాజీ కో ఆప్షన్ సభ్యుడు నజీర్ మృతి

ముస్తాబాద్, సెప్టెంబరు 16:ముస్తాబాద్ మండల కోఆప్షన్ మాజీ మెంబర్ ఎండీ నజీర్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన నజీర్ (65) ఇరవైయేళ్ల క్రితం మండల కోఆప్షన్ మెంబర్‌గా సేవలు అందించారు. కాంగ్రెస్, బీఆర్‌స్ పార్టీల్లో కొనసాగారు. సోమవారం గుండెపోటు రావడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా కూర్చీలో కుప్పకులారు. మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ జిల్లా కోఆప్షన్ మెంబర్ ఎండీ సర్వర్ పాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు సంతాపం తెలిపారు.

సీపీఎం పోరాటంతోనే కదిలిన యంత్రాంగం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 16: సీపీఎం పోరాటంతోనే అధికార యంత్రాంగం కదిలిందని ఆ పార్టీ మండల కార్యదర్శి కోడం రమణ అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్ నగర్ కాలనీని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించగా సీపీఎం నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. కాలనీవాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. కలెక్టర్‌తో పాటు కేకే మహేందర్‌రెడ్డి కాలనీని సందర్శించారన్నారు. ప్రత్యేకాధికారిని నియమించాలనీ కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. గణేశ్ ఉన్నారు,

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16: రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సోమవారం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాకు చెందిన 36 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. 45 ఏళ్ల పురుషుల విభాగంలో పి.రమేష్ గోల్డ్, 35 నుంచి 45 ఏళ్ల లోపు మహిళల విభాగంలో ఎల్.లావణ్య, 16 నుంచి 18 ఏళ్ల బాలికల విభాగంలో వి.నందిని, 16 నుంచి 18 ఏళ్లలోపు బాలురు విభాగంలో గంగుల కార్తీక్ సిల్వర్ మెడల్స్ సాధించారు. 45 సంవత్సరాల మహిళా విభాగంలో కుసుమ కుమారి బ్రౌంజ్ మెడల్ సాధించింది. క్రీడాకారులను యోగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్, యోగా కోచ్ బుర్ర అశోక్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు. అక్టోబర్‌లో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు.

గణేష్ నిమజ్జనానికి వేళాయే..

- సిరిసిల్ల మానేరు తీరంలో ఏర్పాట్లు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



సిరిసిల్లలో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

సిరిసిల్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో వినాయక నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. మంగళవారం జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో వినాయక నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మానేరు తీరంలోని విద్యానగర్ ప్రాంతంలో ఏర్పాట్లు చేసినా మిడ్ మానేరు బ్యాక్‌వాటర్‌తో ఏర్పాట్లకు విఘాతం కలిగింది. దీంతో అత్యవసరంగా మానేరు బ్రిడ్జి ప్రాంతంలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ పరిశీలించారు. డీఎస్పీ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ పసహత్ అలీ బేగ్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి మానేరు తీరంలో ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేశారు. ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, మంచినీటి సౌకర్యంతోపాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. సోమవారం వేములవాడ పట్టణంతోపాటు జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నిమజ్జనం పూర్తి చేసినా ప్రధానంగా మంగళవారమే నిమజ్జనోత్సవం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేల భారీ విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. సిరిసిల్లలో 600 వరకు విగ్రహాలు ఉన్నాయి. నిమజ్జనానికి సంబంధించి నవరాత్రి ఉత్సవ నిర్వాహకులకు పోలీసులు సూచనలు చేశారు.

నిర్ణీత సమయంలో విగ్రహాలు తరలించాలి

వినాయక మండపాల నిర్వాహకులు నిర్ణీత సమయానికి విగ్రహాలు తరలించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. సోమవారం మానేరు తీరంలో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అధికారుల సూచనల మేరకు సౌండ్ బాక్స్‌లు పెట్టుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమం



పూలమాలలు వేస్తున్న సీపీఎం నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 16 : రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించింది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. తెలంగాణ విలీన వారోత్సవాల సందర్భంగా గాలిపెల్లి గ్రామంలో సోమవారం బద్దం ఎల్లారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, స్తూపాల వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన కమ్యూనిస్టు ఉద్యమనాయకుడు బద్దం ఎల్లారెడ్డి అని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టులు ఉద్యమాలు నిర్మించారని గుర్తుచేశారు. విలీన దినోత్సవాన్ని బీజేపీ తెలంగాణ విమోచనదినం పేరుతో వక్రీకరిస్తోందన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ముగింపు సమావేశం ఉంటుందని, అన్ని గ్రామాల నాయకులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్, సీఐటీయూ మండల అధ్యక్షుడు వరుకోలు మల్లయ్య, కార్యదర్శి సావనపెల్లి రాములు, సీపీఎం జిల్లా నాయకులు గురుజాల శ్రీధర్, రామంచ అశోక్, ప్రభాకర్, పెండల ఆదిత్య, చిగుర్ల అనీల్, నరేష్, చందు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులు, అలవాట్లతో క్యాన్సర్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 16: జీవనశైలిలో మార్పులు, అలవాట్ల రిత్యా క్యాన్సర్ వస్తుందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని షాదీఖానాలో 25సంవత్సరాలు దాటిన మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాన్ని ప్రాంభించారు. నోటి క్యాన్సర్ విభాగాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టుల కోసం శిబిరం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝ, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికార వసంతకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, ప్రోగ్రామ్ అధికారి నయీంజహ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సర్వేశ్వర్ ప్రసాద్, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనివాస్, సిరిసిల్ల మసీద్ కమిటీ అధ్యక్షుడు, షాదీఖానా ఇన్‌చార్జి ఎండీ సలీం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకునూరి బాలరాజు, కాముని వనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పతాకావిష్కరణ చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొదట జాతీయ గీతం ఆలపించిన తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ముఖ్యఅతిథిగా వస్తున్న ప్రభు త్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రసంగం ఉంటుందన్నారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు జెండా ఎగురవేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, మెట్‌పల్లి, జగిత్యాల ఆర్డీవోలు శ్రీనివాస్, మధుసూదన్, డీఎస్పీ రఘుచందర్, కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంతు రావు, జిల్లా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 16: సిరిసిల్ల పట్టణంలోని వివిధ వార్డుల్లో గణేష్ మండపాల వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి దంపతులు పూజలు చేశారు. పార్వతీ పుత్ర మండపం, కృష్ణలీల, రజక అభివృద్ధి సంఘం, నవ యువ మిత్ర వీరాంజనేయ సేవా సంఘం, సుతారి సంఘం, శ్రీరాం భగీచా, శ్రీ వినాయక యువ మిత్ర మండలి మండపాలలో చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి దంపతులు పత్యేక పూజలను నిర్వహించారు. మండపాల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం ప్రారంభించారు. అనంతరం సిరిసిల్ల పట్టణం ప్రేమ్‌నగర్ మానేరు తీరాన వినాయక నిమర్జన ఏర్పాట్లను మున్సిపల్ కమీషనర్ సిబ్బందితో కలసి పరిశీలించారు. మానేరు వాగులో నీటి ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు వినాయక నిమజ్జనం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, డైరెక్టర్ బుర్ర రాజు, నాయకులు బొల్లి రామ్మోహన్, బుర్ర నారాయణ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం స్వీకరిస్తున్న గ్రామస్థుడు

చందుర్తి సెప్టెంబరు 16: గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వం స్వీకరిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్ అన్నారు. చందుర్తి మండలంలోని కిష్టంపేట, బండపల్లి జోగాపూర్, రామారావుపల్లె, సనుగుల గ్రామాల్లో సోమవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాడి రమేష్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ విధానాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లోకి వెళ్లాయన్నారు. మరొకసారి ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు ఉన్న పార్టీగా బీజేపీ రికార్డు నెలకొల్పడం ఖాయమన్నారు. ప్రతి వ్యక్తి జాతీయ భావనతో సభ్యత్వం తీసుకోవాలన్నారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందన్నారు. బీజేపీ దేశం కోసం ధర్మం కోసం పని చేస్తోందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పొంచెట్టి రాకేష్, సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జిలు చిర్రం తిరుపతి, పేరుక గంగరాజు, బీజేవైఎం అధ్యక్షులు అంబాలా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఒకరి రిమాండ్

చందుర్తి, సెప్టెంబరు 16 : ఇంటి స్థలం విషయంలో ఓ కుటుంబంపై దాడికి దిగిన ఒకరిని రిమాండ్ పంపినట్లు ఏఎస్సై బాపు సోమవారం తెలిపారు. మండలంలోని ఎనగల్ గ్రామంలో మ్యాకల జలంధర్‌కు గుంటి మల్లేశం మధ్య ఇంటి భూమి విషయంలో గొడవలు ఉన్నాయి. గుంటి మల్లేశంకు మిత్రుడైన చందుర్తి చెందిన బొల్లు మనోజ్ అనే యువకుడు భూ వివాదంపై జలంధర్‌తోపాటు అతడి కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. మనోజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.

గణనాథునికి వీడ్కోలు

చందుర్తి, సెప్టెంబరు 16: చందుర్తి మండల కేంద్రంతోపాటు ఎన్గల్, జోగాపూర్, మర్రిగడ్డ గ్రామాల్లో సోమవారం గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కుల సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్రను కొనసాగించారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు.

వారోత్సవాలు అధికారికంగా నిర్వహించాలి



బద్దం ఎల్లారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 16 : ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి అధ్యక్షతన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ముందుగా బద్దం ఎల్లారెడ్డి చిత్రపటానికి నాయకులు పూలతో నివాళుల ర్పించారు. అనంతరం గుంటి వేణు మాట్లాడారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ మాత్రం నిజాం నియంతృత్వంలోనే ఉందన్నారు. నాడు తెలంగాణ ప్రజలు అణచివేతలకు, దోపిడీలకు గురయ్యారన్నారు. భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్ధుమ్ మొయినుద్దీన్ పిలుపుతో బందూకులు, బరిశెలు, కారం, గొడ్డలను అందుకున్న తెలంగాణ ప్రజలు భారతీయ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు చేశారన్నారు. ఈ పోరాటంలో దాదాపు 3వేల గ్రామాల విముక్తిలో 4500 మంది తెలంగాణ రైతాంగ పోరాటంలో అమరులయ్యారన్నారు. ఈ ప్రాంతానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి, అనభేరి ప్రభాకర్, గడ్డం తిరుపతిరెడ్డి జీవితాల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందకుఉ పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతిరెడ్డి విగ్రహాలను సిరిసిల్లలో ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ జిల్లా నాయకులు కడారి రాములు, నల్ల చంద్రమౌళి, అజ్జ వేణు, కేవీ అనసూయ, సోమ నాగరాజు, తిరుపతిరెడ్డి, మంత్రి చంద్రయ్య, గాజుల పోశెట్టి, ఎల్ల సత్తయ్య పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా కేసీఆర్‌నగర్

- పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- వీధి దీపాలు వెలగక అంధకారం
- నిర్వహణపై చేతులెత్తేసిన మున్సిపల్ శాఖ



కేసీఆర్‌నగర్ ప్రధాన ద్వారం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 16: పక్షం రోజుల క్రితం కేసీఆర్ నగర్ నిర్వహణ చేపట్టలేమని మున్సిపల్ అధికారులు చేతులెత్తేయడంతో తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్ నగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం సిరిసిల్ల పట్టణ వాసుల కోసం తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని సుమారు 1320 డబుల్ బెడ్ రూంల ఇళ్ల నిర్మాణం చేప ట్టింది. ఇందులో సిరిసిల్ల పట్టణానికి చెందిన 1200 మంది లబ్ధిదారులకు అందజేసింది. అప్పటి ముఖ్య మం త్రి కేసీఆర్ చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూంలను ప్రారంభించి కేసీఆర్ నగర్‌గా నామకరణం చేశారు. కేసీఆర్ నగర్ నిర్వహణ మౌలిక సదుపాయలు తదితర అంశాలు మున్సిపల్ చూసింది. పక్షం రోజుల క్రితం నిర్వహణ చేపట్టలేమని చేతులెత్తేసింది. సిరిసిల్ల పట్టణానికి దూరంగా ఉన్న కేసీఆర్ నగర్ నిర్వహణ మున్సిపల్‌కు భారంగా మారిందని సెప్టెంబరు 1వ తేదీ నుంచి నిర్వహణ చేపట్టలేమని కౌన్సిల్ తీర్మానం చేసింది. దీంతో చెత్తను తీసుకెళ్లే ట్రాక్టర్ రాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. వీధి దీపాలు వెలగక కేసీఆర్ నగర్‌లో అంధకారం నెలకొంది. మున్సిపల్ నిర్వ హణ లేకపోవడం, పంచాయతీకి సంబంధం లేన ట్లు వ్యవహరిస్తుండంతో కాలనీవాసులు మండి పడుతున్నారు

మౌలిక వసతులు కల్పించాలి

కేసీఆర్ నగర్‌లో ప్రస్తుతం సుమారు 800 వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కువ శాతం నేత కార్మిక కుటుంబాలు ఉన్నాయి. రవాణా సౌకర్యం లేక సిరిసిల్లకు పనికి వెళ్లడానికి కార్మికులు ఇబ్బందులు పడతున్నారు. కనీస మౌలిక వసతులు సైతం లేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పారిశుధ్య లోపంతో జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజా పాలనలో సమస్యలకు తావులేదని, కేసీఆర్ నగర్‌లోని సమస్యలను పరిష్క రిస్తామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామం కేసీఆర్‌నగర్‌ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలు తెలుసుకోవడానికి ప్రజల మధ్యకు వచ్చామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించి వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో విఫలమైందన్నారు. సమస్యలను మూడు రోజుల్లో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు జల్లం ప్రవీణ్, చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారయణగౌడ్, వైద్య శివప్రసాద్, అకునూరి బాలరాజ్, సూర దేవరాజ్, పెద్దూరి తిరుపతి, మునిగెల రాజు, చుక్క శేఖర్ తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్ నగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శ్మశాన వాటిక కోసం స్థలాన్ని గుర్తించాలని, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తహసీల్దార్ జయంతకుమార్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్, మీర్జా పసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో చర్చిస్తున్న కలెక్టర్, కేకే మహేందర్‌రెడ్డి